క్లుప్తంగా

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీ పోస్టర్ ఆవిష్కరణ



నరసరావుపేట ఈస్ట్: టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గీతా జయంతి-2024 సందర్భంగా నిర్వహించనున్న భగవద్గీత శ్లోకాలు కంఠస్థ పోటీల పోస్టర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆవిష్కరించారు. ఈనెల 8వతేదీ ఆదివారం శ్రీకుసుమ హరనాథ్‌బాబా కల్యాణ మండపంలో పల్నాడు జిల్లాస్థాయి పోటీలను నిర్వహించనున్నారు. భగవద్గీతలోని 6వ అధ్యాయం ఆత్మ సంయమ యోగములోని శ్లోకాలను 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు రెండు విభాగాలుగా పోటీ ఏర్పాటు చేశారు. అలాగే 18 సంవత్సరాలు లోపు, 18 సంవత్సరాలు పైబడిన వయస్సు కలిగిన వారికి సంపూర్ణ శ్రీమద్భగవద్గీత శ్లోక కంఠస్థ పఠన పోటీలు నిర్వహించనున్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అత్తులూరి సుబ్బారావు, వనమా సాంబశివరావు, రెడ్డి హరనాథబాబు పాల్గొన్నారు.

మైముని ఫోక్ డాన్స్ పోటీల్లో వేల్పూరు సత్తా



శావల్యాపురం: నేషనల్ కౌన్సిల్ ఎడ్యుకేషనల్ రీసోర్స్ శిక్షణ వారి సౌజన్యంతో వార్షికోత్సవ వేడుకల్లో జిల్లాస్థాయి పోటీల్లో మండలంలోని వేల్పూరు గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ చూపినట్లు వివేకానంద పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్ సంగ్రపాటి చలపతిరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మైముని ఫోక్ డాన్స్‌లో కోలాటం ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాఠశాల విద్యార్థినులు రోషిణి, శ్రావణి, భార్గవి, ప్రసన్న, హేమలత, మస్తాన్‌బీ, తులసి, అక్షయతేజ, వసంతలక్ష్మి, తదితరులు కోలాటం ప్రదర్శన నిర్వహణలో గైడు టీచరుగా జె.శ్రీనివాసరావు వ్యవరించారు.


పేకాట స్థావరంపై దాడి

నాదెండ్ల: గుట్టుచప్పుడు కాకుండా పేకాటాడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు బుక్కాపురం గ్రామంలో పేకాటాడుతున్నారన్న ముందస్తు సమాచారంతో స్థావరంపై దాడి చేశారు. దీంతో జూదరులు పరుగులు తీయగా, పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. రూ.23 వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ప్రొఫెసర్‌పై దాడి అమానుషం

చిలకలూరిపేటటౌన్: డిసెంబర్ 2వ తేదీన తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ చెంగయ్యపై మతోన్మాదులు చేసిన దాడిని ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ సంఘాల తరుపున తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఏపీ స్టేట్ పాస్టర్స్ ఫెలోషిప్ అదనపు కార్యదర్శి, పల్నాడు జిల్లా అధ్యక్షులు నందమూరి క్రిస్టర్ తెలిపారు. శుక్రవారం విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఫెలోషిప్ పల్నాడు జిల్లా ట్రెజరర్ టి రత్నకుమార్, అదనపు కార్యదర్శి పి ఎలీషా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు బుజ్జి, చార్లెస్, శిఖామణి, చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండల ప్లాస్టర్ల కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్.. చిరువ్యాపారం



- వినుకొండలో వ్యాపార గుట్టు! చిరుధాన్యాల కనికట్టు
- ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ డిపోలకు కాకుండా నేరుగా ప్రైవేటు దుకాణాలకు సరుకులు
- అంతా అధికారుల కనుసన్నల్లోనే...!
- గుట్టుచప్పుడు కాకుండా ఆటోలో తరలింపు

సాక్షి నరసరావుపేట: అవి పేదలకు అందాల్సినవి వస్తువులు. రేషన్ దుకాణాల ద్వారా వాటిని లబ్ధిదారుల చెంతకు చేర్చి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయడం ఆ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం. సంకల్పం మంచిదే అయినా కొందరు అధికారుల నిర్వాహకం వల్ల ఆయా వస్తువులు పేదవాడికి నోటికి చేరడం లేదు. రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు చేరాల్సినవి యథేచ్ఛగా బయట దుకాణాలకు చేర్చేస్తూ నాలుగు రాళ్లు వెనకేసుకుంటున్నారు వినుకొండ ఎంఎల్ఎస్ పాయింట్ సిబ్బంది. సేకరించిన సమాచారం ప్రకారం..

వినుకొండ నియోజకవర్గంలో...

వినుకొండ నియోజకవర్గంలో పల్నాడు జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు రైస్ మిల్లులు తనిఖీ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఎంఎల్ఎస్ పాయింట్ సిబ్బంది తమ గోదాము నుంచి రేషన్‌దుకాణాలకు చేరాల్సిన రాగులు, జొన్నలను రెండు రోజుల క్రితం ఓ ఆటోలో ప్రైవేటు షాపులకు తరలించడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. సదరు ఆటోలో చిరు ధాన్యాలు, మూడు క్వింటాలు రాగులు, మూడు క్వింటాలు జొన్నలు ప్రైవేటు షాపులకు తరలించడాన్ని గమనించిన పలువురు పట్టణవాసులు కంచె చేను మేసిన చందంగా తయారైందని విమర్శలు గుప్పించారు.

లబ్ధిదారులను విసిగించి..

పేదలకు అందాల్సిన బియ్యం, రాగులు, జొన్నలు సక్రమంగా ఇవ్వకుండా లబ్ధిదారులను విసిగిస్తూ వారు తీసుకోకుండా మిగిలిన సరుకును ఇలా యథేచ్ఛగా అమ్ముకోవడం గమనార్హం. ఇటీవల కాలంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు వినుకొండలోని రైస్ మిల్లులపై తనిఖీలు చేస్తున్న సమయంలోనే ఈ తతంగం జరగడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పాయింట్లో తిష్టవేసిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని పలువురు కార్డులదారుల ఆకాంక్ష. మరి ఈ ఘటనపై ఉన్నతాధికారులు ఏం చేస్తారన్నది వేచిచూద్దాం.



ఆటో నుంచి దుకాణంలోకి...

పేదలకు అందాల్సినవవి!

ప్రతిరోజూ ఇలా వాహనాల్లో చిరుధాన్యాలు, పేదలకు అందాల్సిన బియ్యాన్ని అమ్ముకొని అక్కడి సిబ్బంది సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు లేకపోలేదు. రేషన్ షాపుల నుంచి నేరుగా ఆటోల్లో పేదలకు అందాల్సిన చిరుధాన్యాలను బహిరంగంగానే విక్రయిస్తుండటంతో ప్రజలు విస్తుపోతున్నారు. ఒక షాపులో బేరం కుదరకపోతే మరో షాపుకు ఆటోని తరలిస్తూ నాలుగైదు షాపులు తిరిగి సొంతంగా పండించిన రైతు మాదిరిగా వాటిని అమ్ముకోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.



వినుకొండ వీధుల్లో రయ్‌మంటూ ఆటోలో తరలిపోతున్న చిరుధాన్యాలు



తరలిస్తున్న సరుకు గోతాలపై వివరాలు

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

శావల్యాపురం: సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం వారి సారథ్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు వారి ఆదేశాల మేరకు శావల్యాపురం, నూజెండ్ల మండలాల్లో అంగన్‌వాడీ పోస్టులు భర్తీ చేయడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు సీడీపీవో ముదివర్తి అనురాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా సీడీపీవో అనురాధ మాట్లాడుతూ అంగన్‌వాడీ పోస్టులు చేయటానికి కనీసం పదో తరగతి పాసై ఉండాలని అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. నడిగడ్డ, తిమ్మాపురం, కృష్ణాపురం, వెంకుపాలెం-02, హసన్నాయుడుపాలెం, పిట్టంబండ-2, పానకాలపాలెం, శావల్యాపురం, చినకంచర్ల, కొండలరాయుని పాలెం, కొత్తనాగిరెడ్డిపల్లె, కొత్తరెడ్డిపాలెం, భూమాయపాలెం, గాంధీనగర్, తదితర గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు సహాయకుల పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలు కోసం దరఖాస్తులు స్వీకరణ కోసం ఐసీడీఎస్ వినుకొండ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని శావల్యాపురం, నూజెండ్ల, వినుకొండ మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు (ఆయా) పోస్టులకు ఈ నెల 18వ తేదీ లోపు దరఖాస్తులు చేస్తుకోవాలని సీడీపీవో అనురాధ శుక్రవారం తెలిపారు. వినుకొండ మండలం నడిగడ్డ (ఎస్సీ), నూజెండ్ల మండలం తిమ్మాపురం (జనరల్), శావల్యాపురం మండలం కృష్ణపురం (జనరల్) అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులకు, వినుకొండ రూరల్ వెంకుపాలెం (జనరల్), హస్సన్నాయుడుపాలెం (జనరల్), పిట్టంబండ-1 (బీసీ-బి), పిట్టంబండ -3 (ఎస్సీ), పానకాలపాలెం (జనరల్), శావల్యాపురం మండలం చినకంచర్ల (జనరల్), శావల్యాపురం (ఎస్టీ), నూజెండ్ల మండలం పువ్వాడ (ఎస్సీ), కొండలరాయునిపాలెం (ఎస్సీ), కొత్తనాగిరెడ్డిపల్లి (జనరల్), కొత్తరెడ్డిపాలెం (జనరల్), భూమాయపాలెం (జనరల్), గాంధీనగర్ (జనరల్) అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. పాస్‌పోర్ట్ ఫోటో, విద్యార్హత పత్రాలు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు తదితర సంబంధిత పత్రాలను జత చేసి ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కార్యాలయంలో అందజేయాలని వివరించారు. 9493523521ను సంప్రదించాలన్నారు.

మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

మాజీ మంత్రి విడదల రజిని



చిలకలూరిపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి రజని

చిలకలూరిపేట: దేశానికి అత్యుత్తమ రాజ్యాంగం అందించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మహనీయుడని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని కొనియాడారు. డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్నా, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ దరియావలి, వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి మర్తు, ముసలయ్య, దౌలత్‌ఖాన్, సుభాని, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, ఉద్యోగులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్‌వో శ్రీనివాసరావు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం బీసీ సంక్షేమసంఘ నాయకులు గడియారం స్థంభం వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

బొల్లాపల్లి: మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉన్న విగ్రహానికి, ఏర్పాటు చేసిన చిత్రపటానికి ప్రజాసంఘాల నాయకులు పలువురు పూల మాల వేసి నివాళులర్పించారు. గిరిజన సంఘం నాయకులు వి.కోటానాయక్ సర్పంచ్ కె.లక్ష్మానాయక్, వి.సక్రూనాయక్, జి.సునీల్, చిన్నమన్నెయ్య, పేరయ్య పాల్గొన్నారు.

నాదెండ్ల: స్వాతంత్ర్యానంతర భారతదేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించి ప్రజలకు అమూల్యమైన హక్కులు కల్పించిన ఘనత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు దక్కుతుందని రిటైర్డ్ హెచ్‌ఎం, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ దారా కొండయ్య చెప్పారు.

వినుకొండ(నూజెండ్ల): భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నేరెళ్ల రాజు, మాసిపోగు ఏసోబు, వేల్పుల రాంబాబు, మందా సురేష్‌బాబు, వల్లెపు రమేష్‌బాబు, ఎనుబరి వరప్రసాద్, పూనూరి జాన్సన్, అమృతపూడి సురేష్, దూపాటి విజయ్, భవనాసి కోటి, వట్టికోటి శివప్రసాద్, ఒంగోలు నాగేశ్వరరావు, పరిశపోగు మణికుమార్, రవిబాబు, కోటి, అచ్చిబాబు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నరసరావుపేట: వాసవీ సేవా సమితి 30 వసంతాలు వేడుక సందర్భంగా ఆ సంస్థచే రూపొందించిన 2025 నూతన క్యాలెండర్‌ను మానవహక్కుల సంఘ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కాకుమాను పెదపేరిరెడ్డి ఆవిష్కరించారు. శుక్రవారం సాయంత్రం రామిరెడ్డిపేటలోని తన స్వగృహంలో వాసవీ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చీతిరాల గురుపెద్దన్న, ఆర్యవైశ్య నాయకులతో కలిసి ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ సంస్థను దివంగత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య ప్రారంభించారని, ఆయన ప్రారంభించిన సంస్థలు అన్నీ చక్కగా నడుస్తున్నాయన్నారు. కె.జగదీష్‌కుమార్, చీతిరాల కృష్ణారావు, పూటుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించారంటూ..

నాదెండ్ల: కులం పేరుతో తనను దూషించి భౌతిక దాడికి పాల్పడ్డారంటూ చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు కత్తి శంకరరావు తెలిపిన వివరాల మేరకు తాను బీడీడీ న్యూస్ ఛానల్‌లో పల్నాడు జిల్లా ఇన్‌చార్జిగా పనిచేస్తున్నానన్నారు. గ్రామంలోని మోడల్ స్కూలు సమీపంలో ఆలా లక్ష్మీరెడ్డి తన కిరాణా దుకాణంలో బెల్టుషాపు నడుపుతున్నాడని, విషయం తెలిసి తాను ఫోటోలు తీయగా తనను కులం పేరుతో దూషిస్తూ సెల్‌ఫోన్ లాక్కుని భౌతిక దాడికి దిగాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదుపై పోలీసులు విచారిస్తున్నారు.

నడపడం చేతకాక.. డైవర్షన్ పాలిటిక్స్

ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: కాకినాడ పోర్టులో బియ్యం పట్టుకుంటే, ఆ బియ్యం వ్యవహారంలో కోట్లు దోచుకుంటున్న వారిని వదిలేసి పోర్టుల మీద పడి ఏడుస్తున్నారని, డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతూ కాలం వెళ్లదీస్తున్నారని ప్రభుత్వ పెద్దలపై మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని గడియారం స్థంభం సెంటర్‌లో గల కాంస్య విగ్రహానికి పూలమాల వేసి మీడియాతో మాట్లాడారు. అసలు పట్టుకున్న బియ్యం ఎవరివో తేల్చాల్సిన ప్రభుత్వం టాపిక్ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. బియ్యం వ్యవహారం నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. వారు చేస్తున్న డైవర్షన్ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే వారికి ప్రజలు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. రైతులకు రుణమాఫీ, తల్లులకు అమ్మఒడి, మహిళలకు నెలకు రూ.1500లు, నిరుద్యోగ భృతి, ఫీజురీయింబర్స్‌మెంట్ లాంటి సూపర్‌సిక్స్ పథకాలు అమలుచేయకుండా ప్రజలను డైవర్ట్ చేస్తూ తప్పుడు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎస్సీ వర్గానికి చెందిన నిజాయతీపరులైన అధికారులపై తప్పుడు కేసులు పెట్టి నియంతృత్వపరిపాలన చేస్తున్నారని విమర్శించారు. ఇటువంటి పరిపాలన చెల్లదని, అంబేడ్కర్ సాక్షిగా వాస్తవాలు మాట్లాడుతున్నామని, ఎస్సీ వర్గాలకు చెందిన వారిపై పెడుతున్న అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు మాజీ కోర్పోరేషన్ డైరక్టర్లు ఇయం.స్వామి, కందులఎజ్రా, పాలపర్తి వెంకటేశ్వరరావు, ఎస్సీ, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

జాబ్‌మేళాలో 20 మందికి ఉద్యోగాలు

నరసరావుపేట ఈస్ట్: నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ పనిచేస్తున్నదని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలోని ఎస్‌ఏసీ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన జాబ్ మేళాలో 20 మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తమ్మాజీరావు మాట్లాడుతూ, నిరుద్యోగ యువత నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. అందుకు అవసరమైన శిక్షణను నైపుణ్యాభివృద్ధి సంస్థ కల్పిస్తుందని తెలిపారు. ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఏసీ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌ఛార్జ్ హజారత్‌వలి, జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.రవీంద్రనాయక్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎం.వీరాంజనేయులు, ఏ.రమ్య, బి.అంజిరెడ్డి, సీడాప్ పీఓ నాగుల్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు

వేర్వేరు చోట్ల రెవెన్యూ సదస్సులు

- బొల్లాపల్లిలో సదస్సుకు హాజరైన ఆర్డీఓ
- సద్వినియోపరుచుకోవాలంటూ సూచన
- సమస్యలపై అర్జీలిచ్చిన స్థానికులు



కారుమంచిలో రైతు నుంచి అర్జీ తీసుకుంటున్న తహసీల్దారు కె.సుజాత

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని రామాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వినుకొండ ఎమ్మెల్యే, జీవీ ఆంజనేయులు, నరసరావుపేట ఆర్డీవో కె.మధులతలు హాజరై రెవెన్యూ సదస్సులు ప్రారంభించారు. అనంతరం చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ భూరక్షణ చట్టం ద్వారా ఆస్తుల దురాక్రమణకు పాల్పడితే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. సదస్సులో 5 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ ఏవీ సుధాకర్ తెలిపారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: భూముల రీసర్వేలో తలెత్తిన సమ స్యలను గ్రామ సభల ద్వారా పరిష్కరిస్తామని తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. సాతులూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం గ్రామ రెవి న్యూ సభ నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ ముసుగు శోభారాణి, ఉపసర్పంచ్ శరభయ్య, మండల సర్వేయర్ రాంబాబు, డిప్యూటీ తహశీల్దార్ నీలి ధనలక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి 8 సర్వేలు అందాయి. కార్యక్రమంలో వీఆర్వో అంజలి, వీరయ్య, కార్యదర్శి రాఘవయ్య, మధుసూదనరావు, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వినుకొండలో....

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని ఉప్పలపాడు, తిమ్మాపురం, జంగాలపల్లి గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీరు, విద్యుత్, భూసమస్యలపై ప్రజలు అధికారులకు అర్జీలు అందజేశారని తహసీల్దార్ రమేష్ కుమార్ తెలిపారు.

కారుమంచిలో..

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామపంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సు గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు కె.సుజాత మాట్లాడుతూ భూపరమైన సమస్యలు పరిష్కారించటానికి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో డిప్యూటీ సర్వే తహసీల్దారు పేరిసోముల నాసరయ్య, మండల సర్వేయర్ యం.రాజు, వీఆర్వోలు దూపాటి దేవమ్మ, మల్లెల రాద, సచివాలయ సర్వేయర్, రైతులు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రొంపిచర్ల: భూ సమస్యలను సత్వర పరిష్కరించటమే రెవెన్యూ సదస్సుల లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. మండలంలోని విప్పర్ల గ్రామ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మండల ప్రత్యేక అధికారి సూర్యప్రకాశ్ రెడ్డి, ఆర్ఐ కోటేశ్వరరావు, వీఆర్వో ఎం. శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ జల్లిపల్లి శేషమ్మ, మాజీ సర్పంచ్ ఇమ్మడిశెట్టి కాశయ్య, మాజీ ఎంపీటీసీ రామిశెట్టి కోటయ్య పాల్గొన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి గ్రామసభల్ని నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి బాలసుబ్రమణ్యం తెలిపారు. యడ్లపాడు మండలం వంకాయలపాడు రెవెన్యూ గ్రామంలో శుక్రవారం రెవెన్యూ అధికారులతో కలిసి పర్యటించారు. గ్రామస్తుల నుంచి స్థానిక సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. రోజువారీ డైరీ ఏర్పాటు చేయాలని, తదుపరి సందర్శన నాటికి డైరీ లేకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ జె.విజయశ్రీ అధ్యక్షతన నిర్వహించిన ఈసభలో మూడు అర్జీలు మాత్రమే అందినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీటీ అనురాధ, ఎంపీడీవో బి.హేమలతదేవి, మండల సర్వేయర్ సురేంద్రనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ తనిఖీ

నరసరావుపేట: ప్రభుత్వ వైద్యశాలలకు వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమీపంలోని 200 పడకల ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సూపరింటెంట్ ఎం.మంత్రునాయక్, ఆర్‌ఎంవో ఏడుకొండలును వైద్యశాలలో ఉన్న వసతులు, పేషెంట్లకు అందిస్తున్న సేవలు తదితర అంశాలకు సంబంధించిన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పేషంట్ల వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసే విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.

నాదెండ్లలో రేషన్ బియ్యం పట్టివేత

నాదెండ్ల: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యా న్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు గురువారం నాదెండ్ల నుంచి గుంటూరు వైపుకు రేషన్ బియ్యాన్ని మినీలారీలో తరలిస్తుండగా, సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో 25 క్వింటాళ్ళ రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాదెండ్లకు చెందిన కుంభా కోటేశ్వరరావు బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు విచారణలో గుర్తించి కేసు నమోదు చేశారు.

మాజీ సర్పంచ్ పూరిల్లు దగ్ధం

రొంపిచర్ల: మండలంలోని వడ్లమూడివారిపాలెం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో ఆ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మేకల వెంకాయమ్మ పూరిల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్టు సర్క్యూట్ వలన ప్రమాదం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఇంట్లో నుండి మంటలు రావడంతో ఇంట్లో నిద్రిస్తున్న వెంకాయమ్మకు మెలుకువ వచ్చి బయటకు వచ్చి కేకలు వేయడంతో చుట్టు ప్రక్కల వారు వచ్చి మంటలు ఆర్పించేందుకు తీవ్రప్రయత్నాలు చేశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. బాధితురాలు కట్టుబట్టలతో మిగిలారు. సంఘటనా స్థలాన్ని తహసీల్దార్ బి.నిర్మల సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఆ కుటుంబానికి రూ.2వేల ఆర్థిక సహాయం చేశారు. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో ఆర్థికసహాయం అందించేందుకు కృషిచేస్తానని అన్నారు. ఆర్ఐ కోటేశ్వరరావు, వీఆర్వో పడాల సుబ్బారెడ్డి, గ్రామ పెద్దలు వడ్లమూడి శివరామయ్య, గుడిపూడి నరసింహారావు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపించింది

బొల్లాపల్లి : మండల కేంద్రంలో పారిశుధ్యం లోపించింది. వీధుల్లో మురుగు నీరు నిలిచి దుర్గంధాన్ని వెదజల్లుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. డ్రెయినేజీ నిండి సైడ్ కాలువల్లో పూడిక తీయించే పనులు చేపట్టక మురుగు రోడ్లపై ప్రవహిస్తుంది. మండల కేంద్రంలో ప్రధానరహదారిపై మండల స్థాయి అధికారులు, సిబ్బంది నిత్యం సంచరించే ప్రదేశంలో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు దృష్టిసారించి పారిశుధ్యం మెరుగుపరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు పేరెంట్స్ డే మీట్

నాదెండ్ల: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే లక్ష్యంతో శనివారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి చెప్పారు. ఒక విద్యార్థి ఏం చదువుతున్నాడు, టీచర్లు ఎలా బోధిస్తున్నారు, విద్యార్థి మెరుగవుతున్నాడా లేదా అనే విషయాలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించనున్నట్లు తెలిపారు. ప్రోగ్రెస్ కార్డులకు బదులు వినూత్నంగా హోలిస్టిక్ ప్రోగ్రాం వివరించటం జరుగుతుందన్నారు. ఈకార్డు ప్రతి విద్యార్థికి తరగతి గదిలోనే అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు హాజరుకావాలని కోరారు.